ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -118 పేజీలు - 04 వెల - 04/- శనివారం 16 మే 2026

# ఫైటర్ జెట్లు మేడ్ ఇన్ రాయలసీమ

## కేంద్ర మంత్రి రాజ్ నాథ్‌సింగ్‌తో కలిసి ఆమ్కా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు





**ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఆమ్కా ప్రాజెక్టు ముందడుగు**

**36 రోజుల్లో జెట్ స్పీడ్ లో ఈ ప్రాజెక్టుకు అనుమతులు**

**ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారధ్యం**

**త్వరలో బంగారం ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్**

**ఏపీ అంటే అడ్వాన్స్డ్‌ప్రదేశ్ : రాజ్‌నాథ్ సింగ్ కితాబు**

**పుట్టపర్తి, మే 15, ఆంధ్ర ప్రగతి**

దేశం గర్వించే రక్షణ కేంద్రంగా పుట్టపర్తి తయారుకాబోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు

మిగతా 2లో.

# పెట్రో బాంబ్

**లీటర్‌కు సగటున రూ.3 పెంపు**

**సీఎన్‌జీ కిలోకు రూ. 2 పెరుగుదల**

**పెట్రోల్, డీజిల్ పై ధరల బాదుడు**

**నోట్ల రద్దులానే చమురు పిడుగు**



**తెలంగాణలో పెట్రోల్ పై రూ.3.39, డీజిల్‌పై రూ.3.26 వాత**

**ఏపీలో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14 పెంపు**

**దేశ ప్రజలపై మరో భారం మోపిన మోడీ సర్కారు**

**న్యూఢిల్లీమే 15, ఆంధ్ర ప్రగతి**

దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం భారీ షాకిచ్చింది. సామాన్యుడిపై పెట్రోల్, డీజిల్ బాదుడుకు ఉపక్రమించింది. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత మోడీ సర్కార్ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ. 3కు పైగా పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే సీఎన్‌జీ ధరలు కూడా కిలోకు రూ. 2 చొప్పున పెంచింది. ఈ ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ విషయాన్ని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేశాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి.

మిగతా 2లో.

# నాడు కియా.. నేడు ఫైటర్ జెట్..



**అనంతకు చంద్రబాబు రిటర్న్ గిఫ్ట్: మంత్రి లోకేశ్**

**ఉమ్మడి అనంతపురం చరిత్రను మార్చే ప్రాజెక్టు అని మంత్రి లోకేశ్ వ్యాఖ్య**

**నాడు కియా కార్లు, నేడు ఫైటర్ జెట్లు చంద్రబాబు వల్లేనని వెల్లడి**

**వాళ్లది ఫ్యాక్షన్, మనది ఫైటర్ జెట్ అంటూ విపక్షాలపై చురకలు**

**ఈ ప్రాజెక్టుతో రాయలసీమ యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు**

**పుట్టపర్తి, మ్రే 15, ఆంధ్ర ప్రగతి**

ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్రను మార్చే బృహత్తర ఘట్టానికి పుట్టపర్తిలో అంకురార్పణ జరిగిందని, ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) ప్రాజెక్టుతో ఈ ప్రాంతం భారతదేశ రక్షణ రంగంలో కొత్త శక్తి కేంద్రంగా మారబోతోందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ద్వారా రానున్న పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా 14కి 14 స్థానాల్లో ఎన్డీఏ కూటమిని గెలిపించిందని, దానికి రిటర్న్ గిఫ్ట్‌గా ఈ ప్రాజెక్టును

మిగతా 2లో.

# పార్టీ కార్యకర్తల స్వేదం మరచిపోలేనిది

**ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలం**

**ఒంటరి పోరాటం చేసి దెబ్బతిన్న విషయం మరవద్దు**

**పార్టీ శ్రేణులతో జనసేనాని పవన్ కళ్యాణ్**



**అమరావతి,మే 15, ఆంధ్ర ప్రగతి** :ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పక్క రాష్ట్రంలో ఒకరు పార్టీ పెట్టి సీఎం అయ్యారని, తాను కూడా అలా వెళ్తే బాగుండేదని అనేక మంది సలహాలు ఇస్తున్నారని.. కానీ ఏపీలో పరిస్థితులు వేరనే విషయాన్ని వాళ్లు తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో 'జనసేన ఉద్యమ ఆత్మీయ సమావేశం' నిర్వహించారు.

మిగతా 2లో.

# ఆన్ లైన్ లో మహానాడు!

**నెల్లూరులో మహానాడు నిర్వహణకు ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు**

**మోదీ పిలుపు నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం**

**హైబ్రిడ్ విధానంలో రెండ్రోజుల పాటు టీడీపీ మహానాడు**

**ఎన్టీఆర్ భవన్ లో స్టేజి ఏర్పాటు... రాష్ట్రవ్యాప్తంగా స్క్రీన్లపై ప్రసారం**




2లో.

# మళ్లీ నీట్ పరీక్ష

**జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణకు తేదీ ఖరారు**

**వివరాలు వెల్లడించిన ఎన్‌టీఏ**




**న్యూఢిల్లీ, మే 15, ఆంధ్ర ప్రగతి**

ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్

మిగతా 2లో.

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

**ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా**

**రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా**

**రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా**

**సిఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మే 15, ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మిగతా 2లో.

# రూపాయి విల విల

**అత్యంత అధ్వానస్థితిలోకి రూపాయి**

**తొలిసారిగా డాలర్@96**



2లో.

# ఫైటర్ జెట్లు మేడ్ ఇన్ రాయలసీమ




**మొదటిపేజీ తరువాయి**





చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. పుట్టపర్తి అనగానే సత్యసాయిబాబా గుర్తొస్తారు. తన బోధనలతో విశ్వశాంతికి కృషి చేశారు. రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్ అని.. ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారిందన్నారు. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్ గుర్తొచ్చేదని.. ఇకపై జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ అని చెప్పుకుంటారని తెలిపారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామన్నారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ నిలవనుందని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారతీయులకు గర్వకారణం. ఇప్పుడు అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటడంలో ఆపరేషన్ సిందూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని సీఎం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారు చేసి పరీక్షించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు ఫైలట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుందన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ఈ కీలక ప్రాజెక్టుతో మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంక క్షిపణి శక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికి అండగా నిలుస్తుందని సీఎం అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభిస్తామని ప్రకటించారు. 2028 నాటికి కడప స్టీల్‌ఎ÷–లాంట్‌ను పూర్తిచేస్తామన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ద్వారా భారతదేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకో సిస్టమ్‌కు శ్రీకారం చుట్టాం. రూ.686 కోట్లతో 8 సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒకప్పుడు రాయలసీమ అంటే రతనాల సీమ. ఒకానోక దశలో అనంతపురం ఎడారిగా మారిపోయింది. రాయలసీమ రూపు రేఖలు పూర్తిగా మార్చిన ఘనత ఎన్టీఆర్‌ది. సీమకు నీళ్లు తీసుకురావాలి, ప్రజల జీవితాలను మార్చాలని ఎన్టీఆర్ సంకల్పించారు. ఆయన శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో సీమకు జలహారతి ఇచ్చాం. కేంద్రం సహకారంతో రాయలసీమ రూపు రేఖలు మారబోతున్నాయి. రాయలసీమను మళ్లీ రతనాలసీమ చేసే బాధ్యతను ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. కడప స్టీల్‌ప్లాంట్ పనులు జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి నిర్మాణం పూర్తి చేసి రాయలసీమకు కానుకగా ఇస్తాం. దేశానికి ఏపీ రక్షణకవచంగా నిలబడుతోంది. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్.. ఇప్పుడు జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోలు, వచ్చే ఏడాది 1500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తాం. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని సీఎం అన్నారు.

## యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్

**కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్**

యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో రూ.480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. శుక్రవారం పుట్టపర్తిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం చంద్రబాబు పర్యటించారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తి – కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆయుధ ఉత్పత్తిలో స్వావలంబన దిశగా భారత్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. రక్షణ శాఖలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనేది కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరం తగ్గించడానికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని తెలిపారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించామన్నారు. 'యుద్ధ రంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇక నుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారు. ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారింది. హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1294 కోట్ల పెట్టుబడితో రాబోతోంది. ఆయుధాల తయారీ రంగంలో స్వావలంబన దిశగా కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. కొన్నేళ్ల క్రితం రక్షణరంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు మారాయి.. గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయి. 2004లో కేవలం భారత్ రూ.46వేల కోట్ల విలువైన ఆయుధ పరికరాల తయారీ ఉండేది. ప్రస్తుతం రికార్డు స్థాయిలో రూ.1.75లక్షల కోట్లకు చేరిందని గర్వంగా చెబుతున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

**మొదటిపేజీ తరువాయి**

వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# నాడు కియా.. నేడు ఫైటర్ జెట్..

**మొదటిపేజీ తరువాయి**

అందిస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. "నాడు కరవు నేలపై కియా కార్లు పరిగెత్తించిన విజనరీ చంద్రబాబు. నేడు అదే పుణ్యభూమిపై ఫైటర్ జెట్లు ఎగిరేలా చేస్తున్నది కూడా ఆయనే. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆశీస్సులతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో పయనిస్తోంది" అని ఆయన అన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడుల 'నమో జోడి' వల్లే రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని లోకేశ్ తెలిపారు. "రూ.1.35 లక్షల కోట్ల గూగుల్ డేటా సెంటర్, రూ.1.35 లక్షల కోట్ల ఆర్సెలార్ మిట్టల్ పెట్టుబడులతో పాటు ఇప్పుడు పుట్టపర్తిలో లక్ష కోట్ల ఏఎంసీఏ ప్రాజెక్టు వచ్చింది. పోలవరం, అమరావతికి నిధులు, విశాఖ ఉక్కు పరిరక్షణ, విశాఖ రైల్వే జోన్, కర్నూలుకు హైకోర్టు బెంచ్ వంటివన్నీ ఈ పవర్‌ఫుల్ కాంబినేషన్‌తోనే సాధ్యమయ్యాయి" అని వివరించారు. ఏపీలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కార్ కాదని, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ అని ఆయన అభివర్ణించారు. డీఆర్‌డీఓ, ఏడీఏ, హాల్ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టుతో 5వ తరం స్టెల్త్ ఫైటర్ జెట్లను ఇక్కడ తయారు చేస్తారని లోకేశ్ తెలిపారు. భారత్ ఫోర్జ్, భారత్ డైనమిక్స్ వంటి అనేక దిగ్గజ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టనున్నాయని, తద్వారా ఈ ప్రాంత యువతకు వేల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. "ఒక్క కియా పరిశ్రమతోనే అనంతపురం ఎంతో అభివృద్ధి చెందింది. ఇప్పుడు ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో నంబర్ వన్ కావడం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధన కోసం సీఎం చంద్రబాబు, పరిశ్రమల మంత్రి టీజీ భరత్ ప్రత్యేకంగా కృషి చేశారని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై తనదైన శైలిలో చురకలంటించిన లోకేశ్, "వాళ్లది ఫ్యాక్షన్ బ్యాక్‌గ్రౌండ్, మనది ఫైటర్ జెట్ బ్యాక్‌గ్రౌండ్. వాళ్లది కిడ్నాప్ బ్యాక్‌గ్రౌండ్, మనది కియా బ్యాక్‌గ్రౌండ్. రెండిటికీ చాలా తేడా ఉంది. అర్థమైందా రాజా?" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. రాష్ట్రానికి ఈ ప్రాజెక్టును కేటాయించినందుకు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పార్టీ కార్యకర్తల స్వేదం మరచిపోలేనిది

**మొదటిపేజీ తరువాయి**

ఈ సమావేశానికి పవన్ హాజరై మాట్లాడారు. ఒంటరిగా వెళ్లి దెబ్బతిన్నాం.. నేనూ రెండు చోట్లా ఓడిపోయా. జనసేన పార్టీకి మూలస్తంభం కార్యకర్తలే. కుటుంబం నడిపే పార్టీగా ఉండకూడదని కోరుకుంటున్నానని పవన్ అన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు సీఎం విజయ్‌తో పోల్చి తనను వైసీపీ నేతలు విమర్శలు చేయడంపై పవన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దశాబ్దం కాలం పాటు నలిగిపోయి, ఫ్యాక్షన్ రాజకీయాలు తట్టుకుని ఇక్కడి వరకు వచ్చామని వ్యాఖ్యానించారు. ఈ మధ్యన పక్క రాష్ట్రంలో ఒక వ్యక్తి పార్టీ పెట్టి సీఎం అవగానే తనతో పోలిక పెట్టారని తెలిపారు. ఊర్లో పెళ్లికి ఏదో హడావుడి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మన ఊర్లో పెళ్లి జరుగుతుంటే. చిన్నపిల్లలు పరుగులు పెడుతుంటారని.. అలా ఉంది వారి ప్రచారమని ఎద్దేవా చేశారు. ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితులు వేరని.. అక్కడి పరిస్థితులు వేరని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 2019లో తాను పోటీ చేస్తే రెండు చోట్లా ఓడించారని.. దీంతో తనతో ఉన్న నాయకులు వెళ్లిపోయారని ప్రస్తావించారు. పొంతన లేని పోలికలు పెట్టి.. ప్రచారం చేయడం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. కమ్యూనిస్టులు పార్టీ పెట్టి ఎన్నో దెబ్బలు తిని నిలబడ్డారని ప్రస్తావించారు. అదేవిధంగా ఒక రాజకీయ పార్టీ నడపడం అంటే అంత ఈజీ కాదని తెలిపారు. 2007 నుంచి 2018 వరకు దశాబ్దం పాటు తాను ఇబ్బంది పడ్డానని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. దెబ్బతినకుండా ఏదీ రాదని.. 2024కి అధికారంలో భాగస్వామ్యం అయ్యామని తెలిపారు. ఈరోజున అందరూ తనను వదిలేసినా.. తాను పార్టీని ముందుకు తీసుకెళ్తున్నానని స్పష్టం చేశారు. కార్యకర్తల నుంచి బలమైన నాయకత్వం తనకు రావాలని కోరుతున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కేవలం ఒక సంఖ్య కాదని, అది పార్టీ విలువలను, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఒక గొప్ప యజ్ఞమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అమరావతిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, జనసైనికులను ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు కార్యకర్తలు పడుతున్న కష్టాన్ని, పార్టీ ఇస్తున్న భరోసాను ఆయన వివరించారు. పార్టీ సభ్యత్వ నమోదుపై నాదెండ్ల మనోహర్ కీలక గణాంకాలను వెల్లడించారు. 2024 ఎన్నికల తర్వాత జనసైనికులు ఎంతో బలంగా నిలబడి 12 లక్షల 12 వేల సభ్యత్వాలు చేశారని గుర్తు చేశారు. ఈ ఏడాది పార్టీ 25 లక్షల సభ్యత్వాలను లక్ష్యంగా పెట్టుకోగా, క్షేత్రస్థాయిలో జనసైనికుల కృషి వల్ల ఇప్పటికే 21 లక్షల 50 వేల సభ్యత్వాలు పూర్తి కావడం విశేషమని ఆయన కొనియాడారు. ఏటా సభ్యత్వాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని చెప్పారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మనోహర్ భరోసా ఇచ్చారు. 2020లో సభ్యత్వ నమోదు ప్రారంభించినప్పటి నుండి దురదృష్టవశాత్తూ 1,034 మంది జనసైనికులు ప్రాణాలు కోల్పోయారు. పార్టీ సభ్యత్వం ఉండి మరణించిన వారందరికీ కలిపి ఇప్పటి వరకు రూ. 46 కోట్ల 35 లక్షలను చెక్కుల రూపంలో వారి కుటుంబాలకు అందజేశాం అని ఆయన వివరించారు. రాజకీయాల్లో కష్టాలు, సమస్యలు సహజమని, కానీ జనసేన ఎప్పుడూ తన సిద్ధాంతాలకు కట్టుబడే ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

# రూపాయి విల విల

## అత్యంత అధ్వానస్థితిలోకి రూపాయి

## తొలిసారిగా డాలర్@96

**ముంబయి మే 15, ఆంధ్ర ప్రగతి**

: అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ అత్యంత అధ్వానస్థితిలోకి జారుకుంది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోడీ హయాంలో ఆల్‌టైం కనిష్ట స్థాయికి పడిపోయింది. ముడి చమురు ధరలు నిరంతరం పెరగడం, ద్రవ్యోల్బణ ఆందోళనలు, వాణిజ్యలోటు పెరగడం, విదేశీ మారకం నిల్వలు తగ్గడం, ఎఫ్‌డిఐలు పడిపోవడం తదితర కారణాలతో శుక్రవారం ఇంట్రాడేలో డాలర్‌తో పోల్చితే రూపాయి ఏకంగా 96.14 స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) జోక్యంతో కొంత కోలుకుని చివరికి 30 పైసలు నష్టపోయి 95.94కు పరిమితమైంది. గత ఆరు ట్రేడింగ్ సెషన్లలోనే రూపాయి విలువ దాదాపు 2 శాతం మేర క్షీణించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూపాయి మొత్తం 6 శాతానికి పైగా నష్టపోయింది. వారాంతం సెషన్‌లో బిఎస్‌ఇ సెన్సెక్స్ 160.73 పాయింట్లు నష్టపోయి 75,237.99 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 46.10 పాయింట్లు తగ్గి 23,643.50 వద్ద నమోదైంది.

# పెట్రో బాంబ్

**మొదటిపేజీ తరువాయి**

**ధరల పెరుగుదల ఇలా..**

రెండు తెలుగు రాష్ట్రాల్లో లీటర్ పెట్రోల్, డీజీల్‌లపై రూ.3కు పైగా ధరలు పెరిగాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై రూ.3.39, డీజీల్‌పై రూ.3.26 వరకు ఎగబాకాయి. దీంతో ఇక్కడ లీటర్ పెట్రోల్ ధర రూ.110.89, డీజీల్ ధర రూ.98.96కి చేరింది. పెరిగిన దరలతో దేశ రాజధాని న్యూఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 94.77 నుంచి రూ. 97.77కు పెరిగింది. అలాగే డీజిల్ ధర రూ. 87.67 నుంచి రూ. 90.67కు ఎగబాకింది. కోల్‌కతాలో పెట్రోల్ రూ.108.74, డీజిల్ రూ.95.13గా ఉంది. ముంబయిలో పెట్రోల్ లీటర్ ధర రూ.106.68, డీజిల్ రూ.93.14 గా ఉంది. చెన్నైలో పెట్రోల్ లీటర్ ధర రూ.103.67, డీజిల్ ధర రూ.95.25గా నమోదైంది.

**ఇతర రంగాలపై ప్రభావం : ఆర్థిక నిపుణులు**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల కారణంగా ఆయిల్ కంపెనీలపై భారం పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కానీ ప్రధాని మోడీ పొదుపు మంత్రం పాటించాలని చెప్పిన రెండు మూడు రోజుల్లోనే ఈ ధరలు పెరగడం ఇప్పుడు చర్చనీయాం శంగా మారింది. ఇప్పుడు ఇంధన ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఫలితంగా నిత్యవసర వస్తువుల ధరలు, ప్రయాణ చార్జీలు పెరగడంతో పాటు దేశంలోని తదితర రంగాలపై దీని ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా 2024 మార్చి నుంచి పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎటువంటి మార్పు లేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మార్చి 2024లో పెట్రోల్, డీజిల్ రెండింటిపై లీటరుకు రూ. 2 చొప్పున కేవలం ఒక్కసారి మాత్రమే ధరల తగ్గింపు జరిగింది. మరో వైపు నయారా, షెల్ వంటి ప్రయివేట్ రిఫైనరీలు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు.. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. అయితే, పశ్చిమ ఆసియా సంఘర్షణ కారణంగా ప్రపంచ చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. యుద్ధానికి ముందు ఫిబ్రవరిలో బ్యారెల్‌కు సగటున 69 అమెరికన్ డాలర్లుగా ఉన్న దేశ ముడి చమురు దిగుమతి ధరల సగటు, తర్వాతి నెలల్లో బ్యారెల్‌కు 113114 అమెరికన్ డాలర్లకి పెరిగింది.

# మళ్లీ నీట్ పరీక్ష

**మొదటిపేజీ తరువాయి**

చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష–యూజీని (నీట్–యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

-----

# ఆన్ లైన్ లో మహానాడు!

**మే 15, ఆంధ్ర ప్రగతి**

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఈ ఏడాది కేవలం ఆన్ లైన్ లోనే జరపాలని నిర్ణయించారు. వాస్తవానికి ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరులో ఘనంగా మహానాడు నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే, ప్రధాని మోదీ పశ్చిమాసియా సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపుపై జాతికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు పొదుపు చర్యలు పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పుడు మహానాడును ఆన్ లైన్ లో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ప్రకటించడం ద్వారా ఆ పొదుపు చర్యలను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఆన్ లైన్ లో మహానాడును ఈ నెల 27, 29 తేదీల్లో నిర్వహించనున్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ లో ఒక వేదిక నిర్మించి దానిపై పొలిట్ బ్యూరో సభ్యులు ప్రసంగించనున్నారు. ఈ హైబ్రిడ్ మహానాడు కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో ఎలక్ట్రానిక్ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నారు.

# వైభవంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ జన్మదిన వేడుకలు..!

## ..రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన నాయకులు, అభిమానులు.

## ..గజమాలలతో, శాలువాలతో మంత్రి ఫరూక్ కి ఘన సన్మానం.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 15:** నంద్యాల పట్టణంలోని రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి. ఫరూక్ గారి క్యాంపు కార్యాలయం శుక్రవారం శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. మంత్రి ఫరూక్ 76 వ జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యాలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. కేవలం నంద్యాల నియోజకవర్గం నుండే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నలుమూలల నుండి పార్టీ నాయకులు, మైనారిటీ సంఘాల ప్రతినిధులు మరియు అభిమానులు భారీగా తరలివచ్చారు. మంత్రి ఫరూక్ కి పుష్పగుచ్ఛాలు అందజేసి, కేక్ కట్ చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అభిమానులు, కార్యకర్తలు మంత్రి ఫరూక్ ని గజమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన రాజకీయ ప్రస్థానాన్ని, నియోజకవర్గానికి ఆయన చేస్తున్న సేవలను గుర్తుచేసుకుంటూ జేజేలు పలికారు. తనపై చూపిస్తున్న అపారమైన ప్రేమకు, అభిమానానికి మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు, ముఖ్యమంత్రి సహకారంతో నంద్యాల అభివృద్ధికి, మైనారిటీల సంక్షేమానికి నిరంతరం కృషి



చేస్తున్నానని తెలిపారు. నా పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటాను అని తెలిపారు.

ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొని మంత్రి ఫరూక్ కి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



### ఇంధన పొదుపుపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచిన ....

# కర్నూలు ఒకటవ పట్టణ సీఐ.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు క్రైమ్ మే 15:** ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ తదితర ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన పొదుపు అత్యంత అవసరంగా మారిందని కర్నూలు ఒకటవ పట్టణ సీఐ శ్రీ జి. మారుతి శంకర్ పేర్కొన్నారు. దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడ, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు , మంత్రులు కూడా ఇంధన పొదుపు చర్యలకు మద్దతుగా తమ కాన్వాయ్‌ల వాహనాల సంఖ్యను తగ్గిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు ఒకటవ పట్టణ సీఐ శ్రీ జి. మారుతి శంకర్ గారు తన నివాసం నుండి కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు నడిచి వెళ్లి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కర్నూలు ఒన్ టౌన్ సిఐ శ్రీ మారుతి శంకర్ మాట్లాడుతూ ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రతి ఒక్కరు చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే సమాజానికి, దేశానికి ఎంతో మేలు జరుగుతుందని, అవసరం లేని వాహన వినియోగాన్ని తగ్గించాలన్నారు.



# బీజేపీ నూతన జిల్లా అధ్యక్షులకు అభిరుచి మదు అభినందనలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 15:** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ప్రకటించిన నూతన జిల్లా అధ్యక్షుల నియామకాలను స్వాగతిస్తూ నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మదు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పోలవరం జిల్లా అధ్యక్షులుగా శ్రీ ఈకా బుల్లికొండలు దొర, మార్కాపురం జిల్లా అధ్యక్షులుగా శ్రీ పోసం వెంకట కృష్ణారావు, బాపట్ల జిల్లా అధ్యక్షులుగా శ్రీ మువ్వల వెంకట రమణారావు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా శ్రీ పులిరెడ్డి నరేంద్ర కుమార్ రెడ్డి నియమితులైన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లడంలో జిల్లా అధ్యక్షుల పాత్ర ఎంతో కీలకమని అభిరుచి మదు పేర్కొన్నారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకత్వం నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన జిల్లా అధ్యక్షులకు అభినందనలు తెలిపారు.



# జనతా వారధి.. ప్రజా సమస్యల పరిష్కారానికి సారధి..!

## -ప్రజా సమస్యల పరిష్కారమే జనతా వారధి ధ్యేయం.

## -నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు. -జనతా వారధికి విశేష స్పందన.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 15:** రాష్ట్ర పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జనతా వారధి' కార్యక్రమం శుక్రవారం నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి వారధిగా నిలవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వినతుల స్వీకరణ కార్యక్రమానికి బాధితుల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సీనియర్ బిజెపి నాయకులు మేడ మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడ మురళి మాట్లాడుతూ.. సామాన్యుడి గొంతుకను ప్రభుత్వానికి వినిపించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

**వినతుల స్వీకరణ**



జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, జనతా వారధి జిల్లా కన్వీనర్ కశెట్టి చంద్రశేఖర్, కో-కన్వీనర్ పసుపుల రవీంద్ర కుమార్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన వివిధ సామాజిక, వ్యక్తిగత సమస్యలపై అర్జీలను స్వీకరించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అభిరుచిమధు మాట్లాడుతూ ప్రజల ఇక్కట్లను



తీర్చేందుకు పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా పోరాడతామన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇటువంటి కార్యక్రమాలు మరింత తోడ్పడతాయని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన.

## ..ఒక్కరోజే 458 అర్జీలు స్వీకరణ - వేగవంత పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు.

## ..21 రోజులలోపు ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యం : కలెక్టర్ రాజకుమారి గణియా.

## ..ప్రజల వద్దకే అధికారులు రావడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం.

## ..గ్రీవెన్స్ లేని ఆళ్లగడ్డే లక్ష్యం.. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ/నంద్యాల, మే 15:** "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రజల ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులనుఆదేశించారు. శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుండి నేరుగా వినతులు, ఫిర్యాదులు, సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి దూర ప్రాంతాల ప్రజలు రావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నందున, ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిరంతరాయంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వాటి స్వభావాన్ని బట్టి ఒక రోజు నుండి గరిష్టంగా 21 రోజుల లోపు పరిష్కరించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, అందులో భాగంగా మొదటిసారిగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఒక్కరోజే సుమారు 458 అర్జీలు అందాయని, వాటన్నింటినీ స్కాన్ చేసి సంబంధిత అధికారుల లాగిన్‌లకు పంపిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

ప్రజల నుండి అందిన ఫిర్యాదుల్లో దాదాపు 60 శాతం భూ వివాదాలకు సంబంధించినవేనని, 25 శాతం అభివృద్ధి పనులు, రహదారులు, కల్వర్టులు, పాఠశాలల స్థల సమతలీకరణ, శ్మశాన వాటికలు వంటి అంశాలపై ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 10 నుంచి 15 శాతం వరకు వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు, సదరం స్లాట్లకు సంబంధించిన సమస్యలేనని పేర్కొన్నారు. అలాగే మొదటి, రెండో శుక్రవారాల్లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, మూడో శుక్రవారం నాటికి వాటి పరిష్కారానికి చర్యలు పూర్తి చేయాలని, నాలుగో శుక్రవారం నిర్వహించే సమీక్షలో ఎన్ని కేసులు పరిష్కరించామో, ఎన్ని పట్టాలు పంపిణీ చేశామో సమగ్రంగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమర్థవంతంగా స్పందించకపోవడం వల్లే ప్రజలు జిల్లా కలెక్టర్ దాకా రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, గ్రామ మరియు మండల స్థాయి అధికారులు తమ పనితీరును మెరుగు పరచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినా, తప్పుడు సమాచారం అందించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే శుక్రవారం ఉదయం 9 గంటలకే అధికారులు హాజరై, కనీసం 450 అర్జీల పరిష్కారంతో బాధితులకు పత్రాలు అందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, గతంలో చిన్న చిన్న పనుల కోసం ప్రజలు అధికారుల చుట్టూ ఎన్నోసార్లు తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తుండటం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అధికారులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా స్వేచ్ఛగా పని చేసే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఇంకా అనేక వెనుకబడిన ప్రాంతాలు ఉన్నాయని, ప్రజలు అభివృద్ధి పనులు కోరుతూ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఫిర్యాదులు లేని ఆళ్లగడ్డ, సమస్యలు లేని ఆంధ్రప్రదేశ్‌ను చూడాలన్నదే తమ లక్ష్యమని ఆకాంక్షించారు. మండలాల వారీగా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఎక్కువ ఫిర్యాదులను పరిష్కరించిన మండల అధికారులను ప్రోత్సాహకంగా సన్మానిస్తామని తెలిపారు. దీన్ని పోటీగా భావించి అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే అఖిలప్రియ పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను వినేందుకు వరుసగా నాలుగు శుక్రవారాలు జిల్లా యంత్రాంగం మొత్తం ఆళ్లగడ్డకు రావడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్, ఆర్డీఓ, డీఎస్పీ, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన సమస్యలు

1) చాగలమర్రి మండలం ముత్యాలతండాకు చెందిన బుక్కే వీరమ్మ భాయ్ తనకు సొంత భూమి లేదని, సర్వే నెం.959లో అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. సదరు భూమికి డి-పట్టా మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు



దరఖాస్తు సమర్పించారు.

2) రుద్రవరం మండలం నరసాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక (మెయిన్) పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, పాఠశాలలో ఉన్న మూడు పాత తరగతి గదులు శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే ప్రమాదంలో ఉన్నాయని ఉపాధ్యాయుడు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తరగతి గదులను పునర్నిర్మించడంతో పాటు, పాఠశాల రహదారికి సమీపంలో ఉండటంతో విద్యార్థుల భద్రత కోసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

3) ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన వెంకట సుబ్బమ్మ తన భర్త మరణించి రెండేళ్లు అయినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి పెన్షన్ మంజూరు కాలేదని పేర్కొన్నారు. తనకు విధవ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

4) ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి సర్వే నెం.380లోని రెండు ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, సర్వే నెం.349కు సంబంధించిన రీసర్వేలో 0.16 సెంట్లకు బదులుగా 1.71 సెంట్లు నమోదయ్యాయని తెలిపారు. సంబంధిత భూ విస్తీర్ణ వివరాలను సరిచేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు

# గడువులోగా జనన గణన పూర్తి చేయాలి.

**-.నంద్యాల జిల్లాకలెక్టర్ రాజకుమారి.-జనన గణన పనుల్లో జాప్యానికి తావులేదు.**

**-క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్యూమరేషన్ వేగవంతం చేయండి.**

**..ఈనెల 19 నాటికి వంద శాతం పూర్తి చేయాలి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 15:**
జిల్లాలో జరుగుతున్న జనన గణన (ఎన్యూమరేషన్) ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుండి మండల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో జనన గణన పురోగతిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన జనన గణన ప్రక్రియను ఈనెల 19వ తేదీలోగా వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈనెల 16వ తేదీ నాటికి 80 శాతం జనన గణన పనులు పూర్తి కావాలన్నారు. తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటిస్తూ పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఎన్యూమరేటర్ల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ, ఎక్కడైనా జాప్యం లేదా లోపాలు కనిపిస్తే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని తెలిపారు. జనన గణన ప్రక్రియను సమయపాలనతో, పారదర్శకంగా పూర్తి చేయడం ప్రతి అధికారి బాధ్యత అని కలెక్టర్, పేర్కొన్నారు. నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఉండకూడదన్నారు. జిల్లాలో హెచ్ఎల్బీ (హౌస్ లిస్టింగ్ బ్లాక్) పనుల అమలులో బేతంచెర్ల, డోన్ అర్బన్ మరియు రూరల్, బనగానపల్లె మండలాలు, అలాగే బేతంచెర్ల నగర పంచాయతీ ప్రాంతాలు పనితీరులో వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు పనితీరును మెరుగుపరుచుకుని క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే హెచ్ఎల్బీ పనుల ప్రాముఖ్యతపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, ప్రజల సహకారంతోనే జనన గణన ప్రక్రియ విజయవంతమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# మంత్రి ఫరూక్ కి 76వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తాటికొండ బుగ్గరాముడు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 15:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి వర్యులు నస్యం మహమ్మద్ ఫరూక్ కి 76వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు. ఈ సందర్భంగా బుగ్గరాముడు మాట్లాడుతూ.. మంత్రి ఫరూక్ నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో, ఆయువు ఆరోగ్యాలతో,ఎంతో ఉన్నత పదవులు ఆచరించాలి అని ఆ దేవుడిని మనసారా కోరుకుంటున్నాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తాటికొండ మహేష్ బాబు, హిమామ్ హుస్సేన్, వడ్డే నాగేంద్ర,కోటీశ్వరుడు, రాఘవేంద్ర తదితర టీడీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అమర జీవి కామ్రేడ్ నక్కి రామన్న 36వ వర్ధంతి ఘన నివాళులు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 15:** కమ్యూనిస్టు భూ పోరాటయోధుడు.. అమరజీవి కామ్రేడ్ నక్కీ రామన్న 36వ వర్ధంతి సందర్భంగా సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి నాగరాముడు పాల్గొన్నారు. డోన్ నియోజకవర్గం ప్రజలు రెండు ప్రధాన ముఠా రాజకీయ నాయకుల మధ్య నలిగిపోతున్న తరుణంలో "కారుచీకటిలో కాంతిరేఖ" వలె సిపిఐ ఆవిర్భవించింది. కటారు కొండ గ్రామంలో అణగారిన వర్గాల, మైనార్టీల, దళితుల స్వేచ్ఛ కోసం ఎర్రజెండాను చేతబట్టి కామ్రేడ్ నక్కి రామన్న ఆ గ్రామాన్ని విముక్తి చేయడంలో రాజీలేని పోరాటం నిర్వహించి తన ప్రాణాలను 1990 మే 15న అర్పించారని కొని యాడారు.కామ్రేడ్ నక్కి రామన్న డోన్ తాలూకా సిపిఐ కార్యదర్శిగా పనిచేస్తూ గ్రామగ్రామాన తిరిగి కమ్యూనిస్టు పార్టీని స్థాపించి రైతాంగ, వ్యవసాయ కార్మికుల, యువజన, విద్యార్థి సంఘాలను బలోపేతం చేసి వెనుకబడిన, మైనార్టీ, దళిత, గిరిజనులకు అండగా నిలబడి భూమిలేని నిరుపేదల కోసం "దున్నేవాడికే భూమి" నినాదంతో భూస్వామ్య పెత్తందారుల చేతుల్లో ఉన్న భూములను పంచేందుకు భూ పోరాటం చేసి పేదలకు దక్కించి విజయం సాధించారు. అప్పటివరకు అభివృద్ధికి నోచుకోని పేదలకు ఇండ్ల స్థలాలు, పక్కా ఇళ్ళు, పెన్షన్లు, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, త్రాగునీరు తదితర మౌలిక సౌకర్యాల కోసం కృషి చేశారు.కామ్రేడ్ నక్కి రామన్న తాలూకాలో పార్టీని విస్తరించేందుకు కృషి చేస్తూనే కటారు కొండ గ్రామ సర్పంచ్ గా 7 సంవత్సరాలకు పైగా పనిచేసి గ్రామ అభివృద్ధి కోసం విశేషమైన కృషి చేసి నేడు జరుగుతున్న గ్రామ అభివృద్ధికి ఆనాడే బాటలు వేశారు. అందుకే కామ్రేడ్ నక్కి రామన్న మరణించి 36 సంవత్సరాలు గడిచినా నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.ఎర్రజెండా బిడ్డగా ఈ దేశంలో దోపిడీలేని సోషలిస్టు సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేసిన కామ్రేడ్ నక్కి రామన్నను, పార్టీకి ప్రజలకు చేసిన ఆయన సేవలను స్మరించుకుని ఈ దేశంలో మార్పు కోసం ఆయన కలలుగన్న సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి శ్రీనివాసులు ధనుంజయ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శశిధర్ సిపిఐ నాయకులు ఓబయ్య రామయ్య రాజేంద్ర గోకారి తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీ వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ మే 15:**
నంద్యాల మండలములోని మిట్నాల గ్రామములోనీ రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం నాడు మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు సందర్శించి రైతు విశిష్ట సంఖ్యకు సంబంధించిన నమోదు ప్రక్రియను మరియు వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న సాంకేతిక అంశాలైన డ్రోన్ ఆప్ మరియు రైతు ఆప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. మండలంలో భూమి కలిగిన రైతులు అందరూ ప్రభుత్వం ద్వారా ఇస్తున్న విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఇందుకు గాను వారి గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. రాబోయే కాలంలో ఈ విశిష్ట గుర్తింపు కార్డు కలిగిన వారికి వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు వర్తింపచేయబడునని ,అలాగే యూరియా మరియు ఇతర ఎరువుల కొనుగోలు చెయ్యాలన్న ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరమని కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులు అందరూ డ్రోన్ కు సంబంధించిన ఆప్ ను



వారి మొబైల్ లో డౌన్లోడ్ చేసుకుని, దీని ద్వారా వారి పంటలకు పిచికారి చేసుకొనుటకు క్యాబు బుకింగ్ తరహాలో డ్రోన్ బుకింగ్ చేసుకోవచ్చునని తెలిపారు. అలాగే రైతు ఆప్ ద్వారా వ్యవసాయ శాఖ కు సంధించిన వివిధ విషయాలు తెలుసుకోగలరని, ఇందుకుగాను రైతు ఆప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ విధంగా వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ సాంకేతిక అంశాలను రైతులు వినియోగించుకొని వ్యవసాయాన్ని లాభ సాటిగా చేసుకోవాలని తెలిపారు.

**సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి :-**
వ్యవసాయ యంత్రకరణలో భాగంగా ప్రభుత్వం సబ్సిడీ పై వ్యవసాయ యంత్ర పరికరాలు సబ్సిడీ పై అందుబాటులోకి తీస్కొని రావడం జరిగింది. ఈ పథకంలో చిన్న,సన్న కారు రైతులు ఎస్సీ ఎస్టీ మరియు మహిళా రైతులకు 50% సబ్సిడీతో మరియు ఇతర రైతులకు 40% సబ్సిడీ తో వ్యవసాయ పరికరాలు అందజేయబడునని పూర్తి సమాచారం కొరకు సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ఈ నెల 19 వ తేదీ లోగా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని, లబ్ది దారుల ఎంపిక లాటరీ విధానం ద్వారా నిర్వహించబడుతుందని మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు తెలియచేసారు.

**సబ్సిడీ పై విత్తనాల పంపిణీ :-**
ప్రభుత్వం ద్వారా 50% సబ్సిడీపై జీలుగ పిల్లిపెసర విత్తనాలు సరఫరా చేయబడునని జీలుగ పూర్తిధర క్వింటాలుకు 16000 కాగా 50% సబ్సిడీ పై క్వింటా 8000 రూపాయలకు అలాగే పిల్లి పెసర క్వింటా పూర్తి ధర 19600 కాగా సబ్సిడీ పై 9800 రూపాయలకు అందజేయబడునని, ఒక రైతుకి గరిష్టంగా 5 ఎకరాలకు 5 పాకెట్లు ఇవ్వబడునని కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియచేసారు.

# జనసేన ఆత్మీయ సమావేశంలోపాల్గొన్న సిరివెళ్ల జనసేన సీనియర్ నాయకులు.




**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల మే 15:**
జనసేనాని డిప్యూటీ సీఎం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఆళ్లగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ఇరిగల రాంపుల్లా రెడ్డి అధ్వర్యంలో ఈరోజు మంగళగిరిలోని సి.కె కన్వేన్షన్ హౌల్ లో జరిగిన జనసేనాని పవన్ కళ్యాణ్ గారి ఆధ్వర్యంలో జనసేన ఉద్యమి ఆత్మీయ సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న సిరివెళ్ల జనసేన పార్టీ సీనియర్ నాయకుడు పెసరాయి చాంద్ బాషా ..రాయలసీమ ఎలక్షన్ కమిటీ జోన్ సభ్యులు మాభుసేన్,సాదక్, హుస్సేన్ వలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేనాని జనసేన సభ్యత్వాలు చేయించిన ఉద్యమి సాధక్ లను కృతజ్ఞతలు తెలిపి అభినందించారు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ కీలకంగా వ్యవహరిస్తుందని తెలిపారు. అతి త్వరలో రాష్ట్రంలోని అన్ని విధాలుగా ఉన్న పార్టీ కమిటీలను భర్తీ చేస్తామని అంతకుముందు రోజు కొన్ని నియోజవర్గాలపై సమీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అలాగే మెజార్టీ నియోజకవర్గాల్లో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అవన్నీ నాకు తెలుసు అని ఇలాగే మీ మనోభావాలు దెబ్బ తింటే నేను అందరికంటే ముందు ఉండి మీ సమస్యలు తీరుస్తానని తెలిపారు. ఈ విషయంపై చాలా కఠినంగా ఉంటానని తెలిపారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం.

**..ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్ నిర్వహణ. - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే, 15:**
ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో పీజీఆర్ఎస్ ను నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శుక్రవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ కాన్ఫరెన్స్లో ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి శుక్రవారం నియోజక వర్గ స్థాయి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే ఈరోజు మొదటగా పాణ్యం నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారని, ఇది జిల్లా పరిపాలనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. అయితే మండల స్థాయిలోనే పరిష్కరించాల్సిన అనేక సమస్యలు జిల్లా స్థాయికి వస్తున్న నేపథ్యంలో ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో నియోజకవర్గ స్థాయిలోనే ఈ ప్రత్యేక గ్రీవెన్స్ వ్యవస్థను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చే అవసరం లేకుండా ఈ కార్యక్రమం దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలను స్థానికంగానే వేగంగా పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ఒకవేళ సమస్య పరిష్కారం అయ్యే అవకాశం లేకపోతే ఎందుకు సాధ్యం కాదో స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఇలా పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రజలు తరచూ "అధికారులు స్పందించడం లేదు", "అధికారులు అందుబాటులో లేరు" అనే ఫిర్యాదులు రాకుండా ప్రజలకు అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సూచించారు. సమస్య పరిష్కారం అవుతుందా లేదా, కాకపోతే ఎందుకు సాధ్యం కాదనే విషయాలను స్పష్టంగా వివరించాలని తెలిపారు. అలా చేయడం ద్వారా మధ్యవర్తుల చేత మోసపోయే ఘటనలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. కొన్ని సమస్యలు జిల్లా స్థాయిలోనే పరిష్కరించగలమని, మరికొన్ని సమస్యలు పై స్థాయిలో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, వంతెనలు, భారీ ఆర్థిక వ్యయంతో కూడిన అభివృద్ధి పనులు వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్ మంజూరు అయిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు. అందువల్ల ప్రజల సమస్యలపై అధికారులు స్పష్టతతో స్పందించాలని, "ఎందుకు సాధ్యం కాదు" అనే విషయాన్ని కూడా బాధ్యతగా వివరించాలని కలెక్టర్ సూచించారు.

**ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపడమే లక్ష్యం నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్ నిర్వహణకు సీఎం ప్రత్యేక దృష్టి పాణ్యం నియోజకవర్గం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి**

ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూడ ప్రతి సోమవారం కలెక్టరేట్ మరియు మండల స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో నాలుగు వారాల పాటు నిర్వహించి ప్రజలకు మంచి పరిపాలన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అందులో భాగంగా జిల్లాలో మొట్టమొదటిసారిగా పాణ్యం నియోజకవర్గాన్ని ఎంపిక చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ కి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, "ఎన్ని సమస్యలు వచ్చాయి?" అని కాకుండా "ఎన్ని సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యాయి?" అనే అంశంపైనే ప్రభుత్వం సమీక్ష చేస్తోందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో 70 నుంచి 75 శాతం సమస్యలు పరిష్కారం అయినప్పటికీ మిగిలిన 25 శాతం ఎందుకు పరిష్కారం కాలేదని ముఖ్యమంత్రి స్వయంగా ఆరా తీస్తున్నారని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే లక్ష్యంతోనే నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 300కు పైగా అర్జీలు అందాయని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. కాలనీలు, డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, పెన్షన్లు, రెవెన్యూ మరియు ఆన్లైన్ నమోదు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే శుక్రవారం కూడా ఇదే విధంగా పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్.డి. వో (ఇంచార్జి) అనురాధ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేసు జెడ్పి సీఈఓ రమణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి.

**..అంగన్వాడీ కేంద్రాల నుండి 1వ తరగతిలో చేరికల కోసం డోర్-టు-డోర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 15:** ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మండల విద్యాశాఖ అధికారులను, హెడ్ మాస్టర్ లను ఆదేశించారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల నమోదు అంశం పై మండల విద్యాశాఖ అధికారులతో, హెడ్ మాస్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1 నుండి 10వ తరగతి వరకు విద్యార్థుల నమోదును పెంచడానికి లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, వాటిని సాధించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల నుండి 1వ తరగతికి, అలాగే 5వ తరగతి నుండి 6వ తరగతికి విద్యార్థుల మార్పిడి ఆశించిన స్థాయిలో లేదన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఈ విషయంలో పురోగతి తీసుకొని రావాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల నుండి 1వ తరగతిలో విద్యార్థుల చేరికలు పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయులు స్వయంగా ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని వివరించి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమర్థవంతంగా బోధిస్తున్నారని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలే అంగీకరిస్తున్నాయని, ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. కాబట్టి, ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొని నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 1 నుండి 10వ తరగతి వరకు నమోదు ( 2,55,000 ఉంటే, ఈసారి 10% పెంచి 2,81,000 లక్ష్యంగా ఇచ్చారన్నారు. అందులో భాగంగా ఇప్పటికే 2,36,000 వరకు సాధించాం అన్నారు. ఇంకా 45,000 నమోదు చేయాల్సి ఉందన్నారు. 45,000 లో తరగతుల వారీగా మార్పును గమనిస్తే, 5వ తరగతి నుండి 6వ తరగతికి వెళ్లే దగ్గర ఎక్కువ గ్యాప్ కనిపిస్తోందన్నారు. మిగిలిన తరగతుల్లో 80% నుండి 90% వరకు సాధించినప్పటికీ, 5 నుండి 6వ తరగతికి మాత్రం కేవలం 56% మాత్రమే సాధించగలిగాం అన్నారు. అంటే 17,595 మందిని 5 నుండి 6వ తరగతికి పంపాము, ఇంకా 13,510 మంది మిగిలిపోయారన్నారు. పెండింగ్ బ్యాలెన్స్ను పూర్తి చేయాలంటే, ప్రైమరీ టీచర్లు ప్రతి విద్యార్థి యొక్క మరియు ఆధార్ వివరాలను అందించాలన్నారు. ఎంఈఓలందరూ ఈ విషయంలో శ్రద్ధ వహించి, ఈ ప్రక్రియను ఈరోజు లోపే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఈఓ సుధాకర్, డిప్యూటీ డిఈఓ లు, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్ మాస్టర్ లు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ జన్మదిన వేడుకలు




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 15:**
నంద్యాల పట్టణంలోని రైతు నగరంలో రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి ఫరూక్ జన్మదినాన్ని పురస్కరించుకుని హరిబాబు నివాసం వద్ద అభిమానులు, కార్యకర్తలు మరియు నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వృద్ధుల



ఆశ్రమంలో టిఫిన్ కార్యక్రమాన్ని నిర్వహించి వారితోపాటు మంత్రి ఫరూక్, చైర్మన్ హరిబాబు కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ అభివృద్ధిలోనూ, మైనారిటీల సంక్షేమంలోనూ మంత్రి ఫరూక్ పోషిస్తున్న పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన నిండు నూరేళు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ యార్డ్ పాలక మండలి సభ్యులు మరియు భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# మూలమట్టం క్షేత్రంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ జన్మదిన వేడుకలు.

**..ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి ఫరూక్.**

**..సేవా దృక్పథంతో రక్తదాన శిబిరం ప్రారంభం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 15:**
నంద్యాల పట్టణంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మూలమట్టం దేవస్థానంలో రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ 76వ జన్మదిన వేడుకలు శుక్రవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. దేవస్థానం చైర్మన్ పసుపులేటి నారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మంత్రి ఫరూక్ మూలమట్టం దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం లభించింది. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన ప్రార్థించారు.



**రక్తదాన శిబిరం ప్రారంభం**

మంత్రి ఫరూక్ పుట్టినరోజును పురస్కరించుకుని మానవతా దృక్పథంతో ఏర్పాటు చేసిన బృహత్తర రక్తదాన శిబిరాన్ని మంత్రి ఫరూక్ ప్రారంభించారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన యువతను, నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చైర్మన్ పసుపులేటి నారాయణ, ఇతర ముఖ్య నేతలు మరియు అభిమానుల సమక్షంలో మంత్రి తన 76వ పుట్టినరోజు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తల కోలాహలం, శుభాకాంక్షల నినాదాలతో



ఆలయ పరిసరాలు మిన్నంటాయి.
చైర్మన్ పసుపులేటి నారాయణ మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధి ప్రదాత, పేదల పెన్నిధి మంత్రి ఫరూక్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా వర్ధిల్లాలని మూలమట్టం స్వామివారిని వేడుకున్నాము. వారి నాయకత్వంలో నియోజకవర్గం మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తూ ఈ సేవా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఈ వేడుకల్లో దేవస్థాన కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నారా... దిగులు వద్దు..!

**'..మహిళల భద్రత అందరి బాధ్యత'.**

**..శక్తి యాప్ మహిళలకు రక్షణ.**

**బాల్య వివాహాలు చేయడం నేరం..**

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.**

**..ఎస్సై రామ్మోహన్ రెడ్డి 'భరోసా'**

**ఆంధ్ర ప్రగతి మహానంది మే 15:**
ఎవరైనా ఆపదలో ఉన్నారా దిగులు చెందవద్దని, ఎక్కడైనా వేధింపులు ఎదురైనా మహిళలు, యువతులు భయపడకుండా వెంటనే మమ్మల్ని సంప్రదిస్తే సత్వర రక్షణ కల్పిస్తామని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని మహిళలకు శక్తి యాప్, బాల్య వివాహాలు,112,1930, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ...మహిళల భద్రత మనందరి భాద్యత అన్నారు. మహిళలపై జరుగు తున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ గట్టి చర్యలు చేపట్టిందన్నారు. పోలీసుస్టేషన్ కు రాకుండా మహిళల రక్షణ కవచంవంటి శక్తియాప్ ఆధునిక సాంకేతిక సదుపాయాలను మహిళలు వినియో గించుకోవాలన్నారు.



ఎమర్జెన్సీ పరిస్థి తుల్లో ఈ యాప్ ద్వారా వెంటనే సహా యం పొందవచ్చని, మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసు కుంటోందన్నారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి వివాహాలు చేసే వారు, ప్రోత్సహించే వారు, పాల్గొనే వారు అందరూ శిక్షార్హులని అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ స్టేషన్ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. మహిళల రక్షణ, గౌరవం, హక్కుల పరిరక్షణకు సంబంధించిన భారత న్యాయ సంహితలోని ముఖ్యమైన చట్టాలు, శిక్షల వివరాలు, వాటి ప్రాముఖ్యతలను వివరించారు. మహిళలపై జరిగే వేధింపులు, గృహ హింస, బాలికలపై నేరాలు వంటి సంఘటనలు చోటు చేసుకుంటే భయపడకుండా వెంటనే పోలీస్ సహాయం తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, అపరిచిత కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, ఒటిపిలు ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. మొబైల్ ఫోన్‌లు, సోషల్ మీడియా వేదికల ద్వారా ఎదురయ్యే ప్రమాదాలను అనుమానం వచ్చిన వెంటనే పోలీస్ సిబ్బందికి లేదా సైబర్ సెల్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు లేదా సైబర్ మోసాల సమయంలో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తు చేశారు. మహిళల భద్రత పరిరక్షణలో పోలీస్ శాఖతో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమన్నారు. అత్యవసర పోలీసు సాయం కోసం 112 నెంబర్ కు ఫోన్ చేయాలని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# మహానంది మండలంలో నేడు పవర్ కట్.

**ఆంధ్ర ప్రగతి మహానంది మే 14:** మహానంది మండలంలోని గాజులపల్లె, మహానంది, బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాల్లో 2గంటల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. మూడవ శనివారం విద్యుత్ సబ్ స్టేషన్లలో విద్యుత్ పనుల మరమ్మత్తుల కారణంగా ఉదయం 9నుంచి11వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



# వ్యవసాయ విస్తరణలో సమర్థమంతంగా పనిచేయాలి.

**-డీపీఎం శ్రీనివాసులు**

**-ప్రకృతి వ్యవసాయంపై బీఆర్సీలకు శిక్షణ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 15:** గ్రామ స్థాయిలో రైతులకు అవసరమైన జీవామృతాలు, కషాయాలు, బయో ఇన్ పుట్స్ అందించడంలో బిఆర్ సిలు కీలకపాత్ర పోషిస్తాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణలో బి ఆర్ సి యజమానులు సమర్ధవంతంగా పనిచేయడానికి శిక్షణ ఎంతో దోహదపడతాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ "జిల్లా ప్రాజెక్ట్ నిర్వహణ విభాగం"లో మండల స్థాయి నోడల్ బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ (బీఆర్సీ) యజమానులకు మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడం, రైతులకు నాణ్యమైన బయో ఇన్‌పుట్స్ అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ శిక్షణలను నిర్వహిస్తున్నామ రు. శిక్షణ మొదటి రోజు ప్రకృతి వ్యవసాయ జాతీయ మిషన్, ఎల్ నినో ప్రభావం, పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయ మోడల్స్ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని" తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ సలాం, యన్ యఫ్ ఏ ట్రాన్స్ఫర్మేషన్ కమ్యూనికేషన్, డీపీఎంయూ సిబ్బంది, ఎన్ఎఫ్ఏలు, రిసోర్స్ పర్సన్స్, బీఆర్సీ యజమానులు పాల్గొన్నారు.

# రాంకో ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**..ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో- రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తో చర్చలు.**

**..సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రామాంజనేయులు, ినంద్యాల జిల్లా కార్యదర్శి రంగ నాయుడు**



**ఆంధ్రప్రదేశ్ బనగానపల్లె మే 15:** కొలిమిగుండ్ల రాంకో ఫ్యాక్టరీ కాలుష్యం వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రామాంజనేయులు, సిపిఐ నంద్యాల జిల్లాకార్యదర్శి రంగ నాయుడు. ఆధ్వర్యంలో సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రైతులతో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తో చర్చలు జరపడం జరిగిందని అనంతరం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మండల కార్యదర్శి శివయ్య అధ్యక్షతన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె రామాంజనేయులు మాట్లాడుతూ రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ బాధితులకు న్యాయం చేయాలని ఈ రోజున శుక్రవారం నాడు రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రెండవసారి కలవడం జరిగిందని పేర్కొన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఈనెల 30వ తేదీన కొలిమిగుండ్ల తాహసిల్దార్ కార్యాలయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం, రైతులు, ఆర్డిఓ, అగ్రికల్చర్, పొల్యూషన్ అధికారులతో సమావేశం నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపు తామని హామీ ఇవ్వడం జరిగిందని. గత నెల 10వ తేదీన రాంకో ఫ్యాక్టరీ ముట్టడికి సిపిఐ, రైతు సంఘం, ఆధ్వర్యంలో పిలుపు ఇవ్వగా జిల్లా ఎస్పీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చర్చల ద్వారా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విరమించుకున్నట్లు తెలిపారు.సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ కి భూములు ఇచ్చిన రైతుల పిల్లలకు ఉద్యోగులు కల్పించాలని స్థానికులకు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ బాధితులకు న్యాయం జరిపేందుకు రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి గారు రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తారని ఆశ భావవ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు. ఎస్.సుంకయ్య ,కె.రాధాకృష్ణ, నంద్యాల జిల్లా రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారెడ్డి, సోమన్న,సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు సిపిఐ , మండల కార్యదర్శి శివయ్య ఏ ఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి , రైతులు , పుల్లయ్య, వినయ్, రామ్మోహన్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఫరూక్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అభిరుచి మధు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 15:**
రాష్ట్ర మైనారిటీ సంక్షేమ మరియు న్యాయశాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ 76 వ జన్మదినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మంత్రి ఫరూక్ ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో మంత్రి ఫరూక్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభిరుచి మధు కొనియాడారు.

**ఆర్డర్‌బ్రో' యాప్‌ను ప్రారంభించిన మంత్రి ఫరూక్, అభిరుచి మధు**

మంత్రి ఫరూక్ జన్మదిన వేడుకల అనంతరం, నంద్యాల వాసులకు సరికొత్త సేవలను అందించేందుకు ఉద్దేశించిన ' (ఆర్డర్‌బ్రో) మొబైల్ అప్లికేషన్‌ను మంత్రి ఫరూక్, జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి



ఎన్ఎండి ఫిరోజ్ ప్రారంభించారు. ఫుడ్ డెలివరీ, గ్రోసరీ, రైడ్స్, షాపింగ్ మరియు హోమ్ సర్వీసెస్ వంటి బహుళ సేవలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఈ యాప్ లోగోను వారు



ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్, అభిరుచి మధు మాట్లాడుతూ:
"మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని, ప్రజల ముంగిటకే సేవలందించే ఇలాంటి స్టార్టప్‌లను యువత ప్రోత్సహించడం అభినందనీయమన్నారు . 'ఆర్డర్‌బ్రో' సంస్థ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడం



శుభపరిణామం," అని పేర్కొన్నారు.
స్థానిక వ్యాపారాలను బలోపేతం చేస్తూ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ యాప్‌ను రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు మరియు యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.